రూపాయితో

లక్ష రూపాయలు

సంపాదించాలనుకున్న

వారికి

దక్కిందేమిటి?

# మొదలి శ్రీరామప్రసాద్ కథ

# ఎవరికెంత వాటా?

ఆ రోజు లాటరీ ఫలితాలు తెలిసిన రోజు. ప్రతిసారిలాగే ఆరోజు ఆఫీసులో 'విచారపర్వ పారాయణ' ముగిసింది.

'... కష్టాలలో ఉన్నవాడివి. కనీసం నీకైనా వచ్చి ఉంటే ఎంతో సంతోషించేవాళ్ళం మావా...' టీ కప్పు అందుకుంటూ అన్నాడు సదాశివం.

'పోనీలే బాబు ఆ మాత్రం అన్నావు అదేచాలు' అంటూ జవాబు చెప్పాడు సైదయ్య.

ఆ ఆఫీసులో సైదయ్యది జవానుగిరి మాత్రమే అయినా, వయసులో అందరికన్నా పెద్ద. అతనంటే అక్కడ పనిచేసే అందరికీ అభిమానం. పెద్ద కుటుంబీకుడని సానుభూతి. అందరూ అతన్ని 'మావా' అని పిలుస్తుంటే, అతనికి అనిర్వచనీయమైన ఆనందం.

'... సరే... ఇప్పుడొక విషయం చెప్తాను ... డబ్బు పెట్టి, అప్పులు తీసుకొని గూడా లాటరీ 'టికెట్టు కొన్నా ఫలితం సున్న. అంచేత అందరంచేరి కొంటే, అదృష్టం ఉంటే అందరికీ వస్తుంది — లేకుంటే పెద్ద నష్టమూ ఉండదు... ఏమంటారు?' అన్నాడు సైదయ్య.

'అవును మావా నీవన్నది చాలా బావుంది. మొన్న మా వారి ఆఫీసులో ఇలానేచేరి ఒక ప్రైజు సంపాదించారు'— సరోజ అంది సంబరంగా.

'నిజంగానా?' — కాషియర్ సదానందం సంభ్రమపడి మరీ నిర్ఘాంతపోయాడు.

''...ప్చ్. ఏం లాభం?... అందులో మావారు జేరలేదు' సరోజ పెదవి విరిచింది



"అది... అందుకే వచ్చినట్టుంది..." ఆనందంగా అన్నాడు సుబ్బారావు.

సరోజతో సహా అందరూ ఫక్కున నవ్వారు. 'అయితే ఇదంతా నువ్వే నిర్వహిం చాలి మావా' అని అన్నాడు మోహనరావు.

'ఆ ... నాకెందుకు.. చదువురావి వచ్చినోణ్ణి' అంటూ అకౌంటెంటు విర్మలి రావ్‌వైపు చూస్తూ, 'బాబూ, అలాకూర్చుం

టే ఎలా?... మీరే వీటన్నిటికీ సరైన మనిషి'— అని సూచనప్రాయంగా అన్నాడు.

సైదయ్య ప్రతిపాదనను అందరూ ఏకగ్రీవంగా బలపరిచారు. నిర్మలరావు ఎంత వద్దంటున్నా, ఎంత కాదంటున్నా లాభం లేకపోయింది.

అకౌంటెంటు నిర్మలరావు, కోదండం, చిదంబరం ఈ ముగ్గురూ సభ్యులుగా ఒక 'కమిటీ'ని ఏర్పర్చి 'సిండికేటు' ఆరంభించ డానికి మంచిచెడ్డలు ఆలోచించారు.

ఈ తొమ్మిదిమంది, పది సంవత్సరాలు పైచిలుకు నుండి, కలిసి పనిచేస్తున్నారు. అందుకే అంత చనువు. అకౌంటెంటనీ, గుమాస్తా అని, జవానని — అంతస్తులను వారేనాడో విస్మరించారు.

సాయంత్రం ఆఫీసు కాగానే — ఓ అరగంటకి 'సిండికేటు కమిటీ'— ఒక నిర్ణయానికొచ్చింది.

కమిటీ ఒక్కొక్కరికీ ఒక్కొక్క బాధ్యత అప్పగించింది.

నిర్ణయం ప్రకారం వసూళ్ళు చేయటం మోహనరావు వంతు. టిక్కెట్లు కొనడం సైదయ్య వంతు. ఆ టిక్కెట్ల నెంబర్లన్నీ టైపుచేయటం సరోజవంతు. ఆ టైపు చేసిన కాగితాలన్ను పంచడం సుబ్బారావు వంతు.

రోజులు మెల్లిగా గడిచాయి.

మర్నాడు 'డ్రా' రోజు.

ఆ ముందు రోజు...

"ఏమోయ్... సదాశివం... వస్తుందటావా?"

"వ..స్తుం...ది.సాగదీస్తావేమిటోయ్'... అంటూ చిదంబరం మాటల్ని విమర్శించాడు సదానందం.

'ముందు ముడుపు చెల్లించాలోయ్" అన్నాడు మోహనరావ్.

"మా ఇల్లు రిపేరు చేయించాలోయ్' సదాశివం అన్నాడు.

'నా వాటా చిట్‌ఫండ్‌కే. మా అమ్మాయి రెడీగా ఉంది' — కోదండం అన్నాడు.

'వచ్చినా ఏం లాభం?...' భార్యను గుర్తుకు తెచ్చుకుంటూ అన్నాడు సుబ్బారావ్.

'నా మటుకు మన ఏడుగురి వాటాల్లో నుంచి వేసుకొని మావ కూతురు లచ్చి పెళ్ళికి సహాయపడాలని, మన సరోజకు ఒక మంచి 'నెక్లెస్' చేయించాలని ఉందర్రా... ఏమంటారు?' — ఆరుగురూ నిర్మలరావు ప్రతిపాదనకు ఏక కంఠంగా 'అవు'నన్నారు.

'ఛ... వాల్లేండర్రా... నాకెందుకు?— మావకు సహాయపగటం మంచిది. నా వాటా గూడా కలుపుకొని మరీ' సరోజ అన్నది.

'నువ్వూరుకో వమ్మా. మా అందరికీ ఒక్కగానొక్క ఆడపడుచువి... ఆ మాత్రం చేయకపోతే ఎలా?'

సుబ్బారావు అన్న మాటలకు సరోజ కళ్ళు చెమ్మగిల్లాయి.

మర్నాడు అందరివీ షేక్స్‌పియర్ ముఖాల్లా తయారయ్యాయి. వీళ్ళు కొన్న టిక్కెట్టు నెంబరు మొదటి బహుమతి నెంబరు

పొందిన మెంబరుకు దాదాపు ఓ పదివేల మెంబర్ల చేరువలో ఉంది. అది వీరి విచారానికి మరింత కారణం అయింది!

పదకొండు గంటలకల్లా 'టీ' కలిపి తెచ్చే సైదయ్య మొహం పది పైసల టీలా తయారయింది.

ఈ పరిస్థితులలో అందరినీ ఆదుకొనడం తన కర్తవ్యంగా భావించింది సరోజ. వెంటనే 'లంచ్ రూం'లోనికెళ్ళి ఎంచక్కా తొమ్మిది మందికీ టీ చేసి, ఎనిమిది మందిని సాగదీసి బుజ్జగించి మరీ ఇచ్చింది సరోజ.

ఆత్మారాముని అరుపులకు ఆగలేకనో... లేక సరోజ అనునయానికో మెల్లిగా 'లంచ్' ముగించి... పనులు సాగని నెపంపై దాదాపు మూడు గంటలకి సంతాప సభ ప్రారంభించారు.

'.......'

'— —— — — —'

'XXXX XXXX'

"! ! ! !? !? ..."

'మీరేమన్నా అనండి కమిటీ రద్దు చేయడం నాకిష్టంలేదు' సరోజకు గట్టి మద్దతే యిచ్చారు చిదంబరం, సదానందం.


'అసలైనా ఈసారినుండి అన్ని రాష్ట్రాల టిక్కెట్లు కొనడం మంచిదనిపిస్తోంది—' తర్జన భర్జనల మధ్యనుండి సైదయ్య అన్నాడు. మొత్తానికి సైదయ్య ప్రతిపాదనను నిర్మలరావు బలపరచగా అంగీకరించారు అందరూ. కమిటీలో మార్పుండరాదని నిర్ణయించారు.

* * *

మరికొన్ని డ్రాలు జరిగినా — 'ఎక్కడ ఉన్నావే గొంగళి అంటే... వేసినచోటే ఉన్నానన్నట్టు' వాళ్ళు యథాస్థితికే వచ్చారు.

ఎప్పటిలాగే అందరికీ టీలు అందించి — ధైర్యాలు చెప్పడం సరోజకు తప్పలేదు.

"...ఇదిగో చూడండర్రా...మీరు ఈ 'సిండికేటు' మానవద్దండి. మావారి ఆఫీసులోని 'సిండికేటులో' ఆయన లేనప్పుడు ప్రైజు వచ్చింది — ఉన్నప్పుడు రాలేదు...



## జీరాక్స్ యుగం

జీరాక్స్ యంత్రాలు వచ్చాక టైపిస్ట్‌లకు చాలా పని తగ్గిపోయిందనేది పచ్చినిజం! ప్రతిరోజూ ప్రపంచంలో దాదాపు 600 మిలియన్ కాపీలను జీరాక్స్ చేస్తున్నారు. ఇందులో దాదాపు 50 శాతం అమెరికాలోనే తీస్తున్నారట! ఒకప్పుడు ఎంతో ప్రియంగా ఉండే జీరాక్సింగ్ ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటిదాకా నలుపు, తెలుపులోనే వచ్చే జీరాక్స్ కాపీలు ప్రస్తుతం కలర్‌లో కూడా వస్తున్నాయి. — శుభం!

—జూపిటర్

బహుశా ఆయన గ్రహాలే నాకూ పట్టి ఉంటాయి. అంచేత నే తప్పుకొంటే దురదృష్టం తప్పుకోవచ్చునేమో!'' నవ్వుచెప్తూ అంది సరోజ.

సరోజ చెప్పిందానికి ఎవరూ ఒప్పుకోలేదు.

అందరినీ ఒప్పించడానికి విజయవాడ సిటీ బస్సు ఎక్కి దిగినంత హైరానా పడింది సరోజ.

నిర్ణయించిన ప్రకారం మోహన్‌రావు వసూలు చేశాడు. సరోజ దగ్గర తప్ప. అన్ని రాష్ట్రాల టిక్కెట్లు కొన్నాడు సైదయ్య. సరోజ, సుబ్బారావుల బాధ్యతలు కూడా సైదయ్య నిర్వహించాలని అందరూ నిర్ణయించినందున ఆ ప్రకారం సైదయ్యకూ ఓ ప్రతి వ్రాసి మరీ ఇచ్చాడు.

* * *

ఉదయం ఆరు గంటల సమయం కావచ్చింది.

అప్పటికే 'హోటల్ మనోరమ' ముందు సరోజ, సైదయ్య తప్ప మిగిలిన అందరూ హాజరయ్యారు.

అందరి ముఖాలలోనూ అనిర్వచనీయమైన ఆనందం తొణికిసలాడుతోంది.

అవును... అయిదు లక్షలు ఒక్క దెబ్బతో వచ్చాయంటే... మాటలా మరి!

అప్పుడే వచ్చింది సరోజ. వెంటనే అందరూ చేరి కృతజ్ఞతలు వెల్లడించారు. తమమాట నిలబెట్టుకుంటామని మరోసారి అన్నారు.

సైదయ్య రాకకై మరికాసేపు చూసి... ఆపై కాఫీతో ముగించారు.

ఆరున్నర దాటింది... ఏడయింది... సైదయ్య రాలేదు.

''తమకు కలిగిన అదృష్టానికి సంతోషంలో ఇక్కడ మనం కలవాలన్న సంగతి మర్చిపోయి ఉండవచ్చు... మనమే మావ ఇంటికి పోదాం రండి...'' అంటూ నిర్మలరావు దారితీసాడు.

సైదయ్య ఇంట్లోనే ఉన్నాడు.

ఒక్కసారిగా మిన్ను విరిగిపడ్డట్టు అందరూ తమ తమ కృతజ్ఞతలు తెలిపి సైదయ్య హస్తవాసిని కొనియాడారు.

అందరూ సర్దుకున్న తర్వాత సైదయ్య గుండెలో అణగివున్నదేమో పైకి లేచింది.

'నిర్మలరావోయ్' అని కౌగిలించుకుని మరీ కన్నీరు కార్చాడు సైదయ్య.

'నిర్మలరావోయ్'— అని కౌగిలించుకుని మరీ కన్నీరు కార్చాడు సైదయ్య.

ఆనందం పట్టలేక కాబోలు... అని అనుకున్నారందరూ.

'నేనేం చేసేది బాబోయ్' — మరికాస్త గట్టిగా అన్నాడు సైదయ్య.

'అసలింతకూ ఏం జరిగింది మావా' ఆందోళనగా అన్నాడు చిదంబరం.

'లాటరీ వచ్చిందటగదా' అని అంటున్న సైదయ్య గొంతు జీరబోయింది.

అందరికీ ఆశ్చర్యం, ఆపైన అదుర్దా కలిగింది.

'సంతోషించవలసిన ఈ సమయంలో ఇలా అంటావేమి మావా' సరోజ మెల్లగా

అంది.

'ఏం చెప్పమంటావమ్మా...' సైదయ్య స్థాయి తగ్గలేదు.

'అంత చెప్పగూడనిదేముంది' — కోదండం విసుగ్గా అన్నాడు.

'చెప్పినా మీరు నమ్మరు బాబూ'...

'కొంపదీసి మావ టిక్కెట్టు పోగొట్టలేదుగదా!?'—

'.....'

'మాట్లాడు మావా — మాతో చెప్పడానికేం?—

'... ...'

'నీకేం అపకారం జరగకుండా చూసే పూచీ నాది...'

'.....'

'చెప్పు మావా చెప్పు...'

—అన్ని ప్రశ్నలకీ సైదయ్య సమాధానం చెప్పాడు — 'అసలు నేను టిక్కెట్టు కొనలేదు'—

ఒక్క నిమిషం అందరిలో చలనం ఆగిపోయింది.

'కొన్న టిక్కెట్టు పోగొట్టి, అది చెప్పలేక ఇలా బుకాయిస్తున్నాడేమో'—

'అయినా టిక్కెట్లు మనవద్దనే ఉంచుకున్నట్లయితే బాగుండేది.'

సైదయ్య అనవసరంగా అబద్దం చెప్పడు — అని ఒక వైపు అందరికీ నమ్మకం ఉంది.

'నే చెప్పేది నిజం. అసలు నేను టిక్కెట్టు కొనలేదు' సైదయ్య ధోరణిలో మార్పులేదు.

ఇంతలో సుబ్బారావుకి ఏదో తోచినట్టుంది. గబగబా చేతిలోని పత్రిక తీసి చూసాడు.

'అవును... మావ చెప్పింది నిజం. ఐదు లక్షలు 'తిరుచునాపల్లి'లో అమ్మిన టికెట్టుకు వచ్చింది. పత్రికను మరోసారి నిశితంగా చూస్తూ అన్నాడు సదానందం.

మరో నిమిషం అంతా నిశబ్దం.

'పోనీలే మావా... మనకే రావాలని



ఉన్నదా? ఒకవేళ నీవు టిక్కెట్టు కొనివున్నా ఈ ఐదు లక్షలు మాత్రం వచ్చి ఉండేవి కావు' అన్నాడు కోదండం.

'నన్ను అనుమానించడంలేదుగదా' సైదయ్య పలికాడు.

'అంత మాట అనకు మామా... అయినా ఆ డబ్బంతా...'

'ఆ ... ఏదో ఇబ్బంది వచ్చి ఖర్చు పెట్టి ఉంటాడు. ఫరవాలేదులే మావా... నీకే గదా ఉపయోగపడింది' చిదంబరం మామూలుగా అన్నాడు.

వెంటనే అందుకున్నాడు సైదయ్య—

'కాదు బాబూ'—

అసలే అదోవిధంగావున్న అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

'అవును బాబూ... మనం రూపాయిపెట్టి టిక్కెట్టుకొని లక్ష రూపాయల్లో వాటాకై ఏవేవో అనుకున్నాం. ఎంతెంతో ఆశపడ్డాం... భగవంతుని దయవలన గడవడానికి... జరుపుకోడానికి ఉన్న వాళ్లమైనా ఈ తపన ఎందుకో మనకు? నేనే యిచ్చాను సలహా కూడా. కష్టపడకుండా... మరెందరి కష్టమో వెనకేసుకున్న లాభఫలితం రావాలని భ్రమించాం...

'అటు చూడండి లక్షల మంది శరణార్థులు తిండితిప్పలకై కాచుకుని ఉన్నారు. లక్షోప లక్షల మంది అతివృష్టి — అనావృష్టిలతో అల్లల్లాడి పోతున్నారు. కోట్లకొలది ఆస్తి, ప్రాణనష్టాలు అదుపులేని వరదలవల్ల కలుగుతున్నాయి. మొన్నటి గోదావరి పొంగులకు ఆ ప్రాంతం ఖంగుతిన్నది... అందుకే ... అందుకే... పోగుచేసిన ఆ డబ్బంతా 'ప్రధానమంత్రి నిధి'కి పంపాను...'

'... ఇన్నిసార్లు మనకి అదృష్టం రానప్పుడు ఈసారి మాత్రం వస్తుందని ఏముంది?... అందుకే ఆ నలభై ఐదు రూపాయలు ఇలా ఉపయోగించి ఏవో కొన్ని నెంబర్లు మీకు వ్రాసిచ్చాను' — గంభీరంగా అన్నాడు సైదయ్య.

ఆ నిమిషం ఎవ్వరూ మాట్లాడలేదు.

'—ఇదిగో అందుకు నిదర్శనగా ఆ నిధివారు పంపిన రసీదు' — అంటూ సైదయ్య రసీదుతెచ్చి చూపించాడు.

*

